క్లుప్తంగా

బయ్యారపు సురేందర్‌వర్మకు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు



నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డ్ అందుకుంటున్న బయ్యారపు సురేందర్ వర్మ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన డాక్టర్ బయ్యారపు సురేందర్ వర్మకు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డ్ లభించింది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆయనకు అవార్డు, ప్రశంసాపత్రం అందజేసి శాలువాతో సన్మానించారు. ప్రస్తుతం ఆ యన రంగారెడ్డి జిల్లా కీసర మండలం గోధుమకుంటలో యూకే బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

నిరుపేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్, మాజీ కౌన్సిలర్

హుజూర్‌నగర్ : నిరుపేద విద్యార్థులకు తమ సంస్థ ద్వారా నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ పాలెల్లి నరేష్ తెలిపారు. హుజూర్‌నగర్‌లోని 2వ వార్డుకు చెందిన బీటెక్ విద్యార్థి మరికంటి సంకీర్తనకు రూ.30 వేల చెక్కును బుధవారం మాజీ కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబుతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపిక చేసిన నిరుపేద విద్యార్థులకు బీటెక్‌లోఏటా రూ 30 వేల చొప్పున నాలుగేళ్లకు రూ 1.20 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఎమ్మెస్ నగర్ ఫీడర్ కింద సబ్ స్టేషన్ నుంచి కొమరబండ వరకు రోడ్డు మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా సాలార్జంగ్ పేటలో గురువారం ఉదయం 10 గంటల నుంచి 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ టౌన్ ఏఈ నరసింహనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాలార్జంగ్ పేట ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురు, శుక్ర వారాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.సైదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో సామర్థ్యం మారుస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు రోజుల పాటు 3 ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. కరివిరాల, కాగితరామచంద్రాపురం, చెన్నకేశ్వాపురం గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీసేఫ్ యాప్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ మల్లేష్

మఠంపల్లి : విద్యార్థినులు టీసేఫ్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ మల్లేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్స్, సైబర్ నేరాలపై ఆయన విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. మహిళలు, యువతులు, బాలికలు వేధింపులకు గురైతే షీటీమ్ వాట్సప్ నంబర్ 8712686056కు వెంటనే సమాచారం అందించాలని, సైబర్‌నేరాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏటీఎం పిన్ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు ఇతరులకు తెలపవద్దని, సోషల్ మీడియాలో బహిర్గతం చేయవద్దన్నారు. ఈ సందర్భంగా కళాజాత బృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. గురుకుల ప్రిన్సిపాల్ సుష్మా, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, షీటీమ్ సిబ్బంది కవిత, సాయిజ్యోతి, నాగేంద్ర బాబు, పోలీస్ కళాబృందం ఇంచార్జి ఎల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి, సత్యం, కృష్ణ, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డిజిటల్ లెర్నింగ్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయులు డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ పొంది విద్యార్థులకు బోధన చేయాలని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని గురుకుల పాఠశాలలో డివిజన్ గణిత, భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్ బోధనపై నిర్వహిస్తున్న శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి, రిసోర్స్ పర్సన్‌లు, సీఆర్పీలు డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగంగా.. ఎత్తిపోతలు



గ్రౌండ్ లెవల్‌కు చేరుకున్న జాన్‌పహాడ్ లిఫ్ట్ పంప్‌హౌస్ నిర్మాణం

- పాలకవీడు మండలంలో కృష్ణా, మూసీ నదులపై రెండు లిఫ్టులు
- రూ.335 కోట్ల వ్యయంతో చేపడుతున్న ప్రభుత్వం
- పూర్తయితే 15 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు
- త్వరలో సాకారం కానున్న రైతుల చిరకాల స్వప్నం

పాలకవీడు : పాలకవీడు మండల రైతులను ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న సాగునీటి పథకాల కల త్వరలో ఫలించనుంది. తలాపునే ఉన్న కృష్ణా, మూసీ నదీజలాలను తమ పొలాలకు తరలించుకోవాలన్న ఈ ప్రాంత రైతుల ఆకాంక్షను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం నెరవేర్చేందుకు కృషిచేస్తోంది. సుమారు 15 వేల ఎకరాల భూములను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన రెండు ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పథకాల పనులు వేగవంతం చేసింది.

తలాపునే నదులున్నా..

మండలంలో కృష్ణానది పరీవాహక ప్రాంతాలు జాన్‌పహాడ్, చెరువుతండా, కోమటికుంట గ్రామాలు అలాగే మూసీనది పరీవాహక గ్రామాలు బెట్టి తండా, పాద్యాతండా, సజ్జాపురం పరిధిలోని చివరి భూములున్న రైతులు దశాబ్దాలుగా సాగునీటి కోసం తీవ్రంగా ఎదురు చూశారు. వారికి తలాపున కృష్ణా, మూసీ నదులు ప్రవహిస్తున్నప్పటికీ భూములు మాత్రం బీడుగానే దర్శనమిచ్చేవి. కేవలం వర్షాలపై ఆధారపడి పంటలను సాగుచేయడం, లోతైన బోరుబావులు తవ్వడం తప్ప వారికి మరో మార్గం లేకపోయింది. దీని కారణంగా తాము వేసిన పంటలు పండుతాయో ఎండుతాయో తెలియని పరిస్థితి ఉంది. ఇలాంటి తరుణంలో సాగునీటి కష్టాలను తీర్చేందుకు మండలంలో రెండు ఎత్తిపోతల పథకాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రూ.303 కోట్లతో జాన్‌పహాడ్ లిఫ్ట్

జాన్‌పహాడ్ గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో కృష్ణానదిపై రూ.303 కోట్ల వ్యయంతో చేపట్టిన జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అలాగే బెట్టి తండా గ్రామం నుంచి సుమారు కిలోమీటర దూరంలో మూసీనదిపై రూ.33 కోట్లతో చేపట్టిన బెట్టితండా లిఫ్ట్ పనులు కూడా ముమ్మరమయ్యాయి. మొత్తంగా రూ.335 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ రెండు ఎత్తిపోతల పనులను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేయిస్తోంది. ప్రస్తుతం జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ పంప్‌హౌస్ నిర్మాణం గ్రౌండ్ లెవల్‌కు చేరుకుంది. ఇప్పటికే అక్కడకు చేరుకున్న భారీ పైపులకు సిమెంట్ కోటింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ రెండు లిఫ్టుల పనులు పూర్తయితే దాదాపు 15వేల ఎకరాలకు సాగునీరందనుంది. లిఫ్టుల పనులు వేగంగా సాగుతుండడంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి బాధలు తీరుతాయి



జాన్‌పహాడ్ లిఫ్ట్ పనులు పూర్తయితే మా ప్రాంత రైతులకు సాగునీటి బాధలు తీరుతాయి. సాగు నీళ్ల లేక వర్షాధారంగా పత్తి, ఇతర మెట్ట పంటలు సాగుచేస్తూ తీవ్రంగా నష్టపోతున్నాం. మా పొలాలకు కొద్ది దూరంలో కృష్ణా నది ఉన్నా ప్రయోజనం లేకుండాపోయేది. ప్రస్తుతం లిఫ్ట్ పనులు వేగంగా నడుస్తుండడంతో మా చిరకాల స్వప్నం త్వరలోనే సాకారం అవుతుందని భావిస్తున్నాం.

– పిట్టల చిన్న సైదులు, రైతు, జాన్‌పహాడ్

పాలస్తీనాపై దాడిని ఖండిస్తూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

గరిడేపల్లి : పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా గరిడేపల్లి మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, మేకల కనకారావు మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులు దుర్మార్గమైనవని అన్నారు. పసి పిల్లలను, మహిళలను అమాయక ప్రజలను విచక్షణరహితంగా చంపుతూ, అనేక మందిని క్షతగాత్రులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అండదండలతో ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాలో నరమేధం సృష్టిస్తోందని అన్నారు. ప్రపంచ దేశాల ప్రజలు ఈ దారుణ మారణహోమాన్ని ఖండిస్తూ పెద్దఎత్తున పాలస్తీనాకు మద్దతుగా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామళ్ల నవీన్, గండు నాగేష్, కామళ్ల శ్రీను, పర్వతాలు, సాంబయ్య, అంజయ్య, లక్ష్మయ్య, రాంబాబు, వెంకటి, ముత్తయ్య, భిక్షం, సూర్య, మంగమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలోకి పాము



పామును తీసుకెళ్తున్న పంచాయతీ సిబ్బంది

మునగాల : మండలంలోని నేలమర్రిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో పెద్ద తాచుపాము ప్రత్యక్షమైంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు పక్కనే పిచ్చి చెట్లు తొలగిస్తున్న గ్రామపంచాయితీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు చేరుకొని సుమారు ఆరు అడుగుల పొడవు ఉన్న తాచుపామును చంపారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత శాఖ సిబ్బంది పాఠశాల ఆవరణ చుట్టూ ఉన్న పిచ్చి చెట్లు, కంపచెట్లను తొలగించి శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

మునగాల : బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఎంపికైన విద్యార్థుల ఫీజుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ నాయకుడు సొంపంగు గోపి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించేందుకు ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఆయా పాఠశాలలకు చెందిన యాజమాన్యాలకు రావాల్సిన ఫీజు బకాయిలు అందకపోవడంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను పాఠశాలలకు అనుమతించడం లేదని ఆరోపించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొన్నదని వాపోయారు. ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద పెండింగ్‌లో ఉన్న ఫీజులను విడుదల చేయాలని గోపి కోరారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన



విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న లయోలా కాలేజీ విద్యార్థులు

మేళ్లచెరువు : రైతులు సాగు సమయంలో విత్తన శుద్ధి విధిగా చేపట్టాలని విజయవాడలోని లయోలా కాలేజీకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు తెలిపారు. ఈమేరకు బుధవారం మండలంలోని గుడిమల్కాపురంలో రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. మిరప పంట సాగుచేసే రైతులు 100 గ్రాముల విత్తనానికి 5 గ్రాముల ట్రైకోడర్మా విరిడీ 5 మిలీ నీటిలో కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. సహజ సిద్ధంగా ఎరువులు తయారు చేసుకొని పంటలకు వాడాలని సూచించారు. క్రిములు, బూజు తెగులు, విత్తన నాణ్యత, మొక్క పెరుగుదల కోసం చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యసాయ విద్యార్థులు శ్రీలత, శ్రీహర్షిత, సాయి రేణుక, సాత్విక, సౌమ్య, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పోషకాలు మెండు



హుజూర్‌నగర్ : గర్భిణులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీడీపీఓ శ్రీలిఖిత




నేరేడుచర్ల : ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

హుజూర్‌నగర్ : చిరుధాన్యాలలో పోషకాలు మెండుగా ఉంటాయని ఏసీడీపీఓ శ్రీలిఖిత అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని చెప్పారు. అంతేకాకుండా పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఆమె పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సోవమ్మ, అంగన్‌వాడీ టీచర్ షహజాది బేగం, ఏఎన్‌ఎం లలిత, ఆయా పద్మ ఆశా వర్కర్లు, గర్భిణులు బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం

నేరేడుచర్ల : బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీలోని రామాపురంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా తల్లులు, చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గృహ సందర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆర్.ప్రీతి, ఎ.అన్నమ్మ, ఆశా వర్కర్ విజయరాణి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి వేణుగోపాల్

హుజూర్‌నగర్ : క్షయవ్యాధి రహిత సమాజమే టీబీ ముక్త్ భారత్ లక్ష్యమని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని లింగగిరి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఛాతి ఎక్స్‌రే శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 చివరి నాటికి దేశం మొత్తాన్ని క్షయవ్యాధి రహితంగా మార్చడం కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక అమలు చేస్తోందని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు రావడం, బరువు కోల్పోవడం, తేమడలో రక్తజీరలు, రాత్రి వేళ జ్వరం ఉన్నట్లయితే టీబీగా అనుమానించి వెంటనే పీహెచ్‌సీల్లో పరీక్ష చేయించుకోవాలని ఆయన కోరారు. కాగా, శిబిరంలో 147 మందికి ఈ ఎక్స్‌రే తీశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మ, పీహెచ్‌ఎన్‌ఓ నూర్జహాన్ బేగం, టీబీ జిల్లా కోఆర్డినేటర్లు ప్రసాద్, మాధవరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్, ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ మమత, అలివేలుమంగ, ప్రశాంతి, పీఎస్ సోహెల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి తగదు

నడిగూడెం : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం తగదని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి కేసగాని భద్రయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, రాజ్యాంగంపై దాడి జరిగినట్లు పరిగణించాలని పేర్కొన్నారు. దాడి చేసిన న్యాయవాదిపై చట్టరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలకు డెస్క్ బెంచీలు

పెన్‌పహాడ్ : మండలంలోని మాచారం ప్రాథమిక పాఠశాలకు రూ.25 వేల విలువైన డ్యూవల్ డెస్క్ బెంచీలను అదే గ్రామానికి చెందిన గెల్లా పుండరీ జ్ఞాపకార్థం ఆయన భార్య చంద్రకళ బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నకిరేకంటి రవి ఆధ్వర్యంలో దాతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు

మఠంపల్లి : మండలంలోని ఆయకట్టు, చివరి ఆయకట్టులో పంటలు సాగు చేసిన రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని తహసీల్దార్ మంగా రాథోడ్ అన్నారు. బుధవారం మఠంపల్లి మండల తహసీల్దార్ కార్యాయలంలో రెవెన్యూ, వ్యవసాయ, పీఏసీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మఠంపల్లి మండలానికి ఇప్పటి వరకు 2400 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయిందని, మరో 150 టన్నుల యూరియా కూడా ఈ వారం లోపు వస్తుందని తెలిపారు. మండలానికి విడతల వారీగా యూరియా వస్తుందని తెలిపారు. యాసంగి సీజన్ కోసం యూరియాను రైతులు నిలువ చేసుకోవద్దని, యూరియా నిల్వ ఉంచితే గడ్డ కట్టడమే కాకుండా దానిలో నత్రజని శాతం తగ్గిపోతుందని తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి బొలిశెట్టి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు రామచంద్రయ్య, బాబునాయక్, పీఏసీఎస్ సీఈఓ తిరుపతయ్య, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్లు స్వీకరణ

మోతె : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేయు అభ్యర్థుల నుంచి గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి ఆంజనేయులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎన్నికల నియమావళిపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 21 సంవత్సరాలు నిండి ఉండి, ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఎస్, ఎస్టీ, బీసీ వారు కుల సర్టిఫికెట్‌ను నామినేషన్ పత్రాలకు జతపర్చాలని తెలిపారు. నేరచరిత్ర, చర, స్థిరాస్తులు, విద్యార్హతలతో కూడిన అఫిడవిట్, ఇద్దరు సాక్ష్యులతో సంతకం చేయించాలన్నారు. నిబంధనలతో కూడిన నామినేషన్లనే ఎన్నికల అధికారులు పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు.

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి

- ఆర్డీఓ శ్రీనివాసులు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్ : సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) వారోత్సవాల్లో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌టీఐపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన సమాచారాన్ని అధికారులు అందించాలని చెప్పారు. ప్రతిఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, దానిని దుర్వినియోగం చేయవద్దని అన్నారు. ప్రతిఒక్కరూ చట్టం స్ఫూర్తిని, దాని ప్రాముఖ్యతను కాపాడాలని ఆయన కోరారు. అనంతరం చట్టం పూర్తి స్థాయిలో అమలు జరిగేలా చూడాలని కోరుతూ పలువురు ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, కత్తుల నాగేందర్, బి.కవిత, ఎస్.సైదులు, కమలాకర్, మంగ, సురేందర్‌రెడ్డి, డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు, ఆర్‌టీఐ సామాజిక కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలి



గరిడేపల్లి : బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న ఒంటెద్దు నరసింహారెడ్డి, నాయకులు

గరిడేపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని పార్టీ రాష్ట్ర నాయకుడు, హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, నిరుద్యోగులను, మహిళలు, ఆటో కార్మికులను, వృద్ధులను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం మీద ప్రజలు నమ్మకం పోయిందని అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను బాకీ హామీలుగా కార్డు ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి బాకీ హామీలను కార్డు ద్వారా వివరించాలని కార్యాకర్తలకు సూచించారు. అనంతరం బాకీ హామీల కార్డును ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కడియం వెంకటరెడ్డి, కేవీఎస్‌రెడ్డి, కృష్ణనాయక్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి

నేరేడుచర్ల : మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పథకాల అమలులో బాకీ పడిన మొత్తాన్ని చెల్లించాలని ప్రజలు నిలదీయాలని బీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఒంటెద్దు నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబుతో కలిసి కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ వద్దకు కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తే వాగ్దానాలపై నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నాయకులు చెన్నబోయిన సైదులు, చందమళ్ల జయబాబు, యలబోయిన లింగయ్య, చిత్తలూరి సైదులు, వస్కుల సుదర్శన్, పల్లెపంగు నాగకరాజు, అంబటి నాగయ్య, రాంబాబు, శేఖర్, లింగయ్య, సోమయ్య, సైదులు, బాలునాయక్, శంకర్ తదితరులు ఉన్నారు.

మృతులకు నివాళి



కోదాడరూరల్ : భాగ్యరాజ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడరూరల్ : యూత్ కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు, పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆళ్ల భాగ్యరాజ్(34) చిన్న వయస్సులో మృతి చెందడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని టీపీసీసీ నాయకుడు సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ పారసీతయ్య అన్నారు. బుధవారం గుండెపోటుతో మృతి చెందిన భాగ్యరాజ్ మృతదేహాన్ని వారు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ యూత్ వింగ్, సోషల్ మీడియా కోర్డినేటర్‌గా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ఎంతో కృషి చేశారని అన్నారు. పార్టీ అతని కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు, యూత్ విభాగం నాయకులు ఉన్నారు.

మాజీ ఎంపీపీ దొడ్డా సురేష్‌బాబుకు నివాళి

చిలుకూరు : చిలుకూరు గ్రామంలో మాజీ ఎంపీపీ దొడ్డా సురేష్‌బాబు(55) మృతదేహాన్ని బుధవారం వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. కాగా, స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డా నారాయణరావు చనిపోయిన కొద్ది రోజులకే ఆయన కుమారుడు దొడ్డా సురేష్‌బాబు మృతి చెందడంతో గ్రామం, ఆయన కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అమెరికాలో ఉన్న సురేష్‌బాబు కుమారుడు, కుమార్తె రావాల్సి ఉండడంతో ఆయన అంత్యక్రియలను చిలుకూరులో రెండు రోజుల తరువాత నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.

మాజీ సర్పంచ్ అంతయ్యకు..

నడిగూడెం : మండల పరిధిలోని బృందావనపురంలో మాజీ సర్పంచ్ మండవ అంతయ్య మృతదేహాన్ని బుధవారం పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ, బృందానపురం మాజీ సర్పంచ్‌లు బెల్లంకొండ హనుమయ్య, అనంతుల ఆంజనేయులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు ఉన్నారు.

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం



సిరిపురం, శ్రీరంగాపురం మధ్య బురదమయంగా రోడ్డు



కంకర తేలిన సిరిపురం రోడ్డు

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం- శ్రీరంగాపురం గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. చినుకు పడితే రోడ్డు చిత్తడిగా మారుతోంది. రహదారిపై కంకర తేలి లోతైన గుంతలు ఏర్పడ్డాయి. రహదారిని ఇరువైపులా కంపచెట్లు కమ్మేశాయి. పలు చోట్ల మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి ఈ రహదారి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గుంతలమయంగా ఉండడంతో చీకట్లో ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే భయపడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రెండు గ్రామాల మధ్య బీటీ రహదారి నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మితిమీరిన వేగం.. ప్రమాదాలు నిత్యకృత్యం

- జాతీయ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న ప్రమాదాలు
- నిబంధనలు పాటించని వాహనదారులు
- మృత్యువాత పడుతున్న ప్రజలు మూగజీవాలు



రూల్స్ అతిక్రమించి రోడ్డు దాటుతున్న లారీ



జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపి ఉంచిన వాహనాలు

మునగాల : మండల పరిధిలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించిన అనంతరం తగ్గుముఖం పట్టాల్సిన రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రయాణికులు, రహదారికి పక్కనే ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రహదారి విస్తరణతో హైవేపై వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తుండంతో ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది. దీంతో పలువురు క్షతగాత్రులు కావడమే కాక మృత్యువాత పడుతున్నారు. సూర్యాపేట- కోదాడ మధ్య ఏదో ఒక ప్రాంతంలో నిత్యం రహదారిపై ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గ్రామాల్లో రోడ్డు దాటే సమయంలో కనులు మూసి తెరిసే లోపే వాహనాల వేగానికి బలికావాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల శివారులలో వాహనాల అతివేగానికి ప్రతిరోజు ఏదో ఒకచోట మూగజీవాలు బలవుతూనే ఉన్నాయి. కొందరు తమ పశువులను రహదారి మధ్యన గల డివైడర్లపై మేపుతుండడంతో ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయి. దీంతో వేలాది రూపాయలతో కొనుగోలు చేసిన పశువులు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం నిద్ర మత్తు వీడి రహదారిపై వెళ్లే వాహనాల వేగాన్ని అదుపుచేసి ప్రమాదాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.